క్లుప్తంగా

నిలిచిపోయిన పనులు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని పేరాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో కొద్ది రోజులుగా పారిశుద్ధ్య పనులు నిలిచిపోయినట్లు మంగళవారం కొంతమంది పాలక వర్గ సభ్యులు స్థానిక ఎంపీడీఓ, ఎంపీఓకు వేర్వేరుగా లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు చేశారు. గ్రామ పంచాయతీలో చాలా కాలంగా పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులను పనులు చేయకుండా సర్పంచ్ నిలిపి వేయడంతో ఈ పరిస్థితి నెలకొందని ఉప సర్పంచ్ తగరం జగన్నాథంతోపాటు పలువురు వార్డు సభ్యులు కలిసి ఈ ఫిర్యాదులను అందించారు. కాగా దీనిపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాల్సిందిగా ఎంపీఓ సీతారామరాజును స్థానిక ఎంపీడీఓ విద్యాధరరావు ఆదేశించారు.

పరిశుభ్రతపై అవగాహన

మణుగూరురూరల్: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని బాపనకుంట గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి మలేరియా పాజిటీవ్ నమోదైన నేపథ్యంలో ఆ గ్రామంలో మణుగూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మలేరియా అధికారి గొంది వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం గ్రామాల్లోని పలు ఇళ్లల్లో దోమలమందును పిచికారీ చేయించారు. కార్యక్రమంలో ఎస్‌సీవీబీడీసీ కోఆర్డినేటర్ కృష్ణయ్య, సబ్ యూనిట్ ఆఫీసర్ లింగ్యా నాయక్, రాంప్రసాద్, ఉమేష్, తార, సరిత తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయ హుండీ ఆదాయాన్ని దేవాదాయ శాఖ కొత్తగూడెం డివిజన్ ఇన్‌స్పెక్టర్ బేల్‌సింగ్ పర్యవేక్షణలో అధికారులు మంగళవారం లెక్కించారు. స్వామి వారి ఉత్సవాలకు గాను ఆలయానికి వచ్చిన ఆదాయ వివరాలను ఆలయ మేనేజర్ రమణ తెలిపారు. టిక్కెట్ల ద్వారా రూ 2,27,710, వేలం పాట ద్వారా రూ.1,37,000, స్వామి వారి హుండీ లెక్కించగా రూ.3,32,253, దుకాణాల ద్వారా 1,20,711 మొత్తంగా రూ.8,17,674 ఆదాయం వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంతో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం గ్రామంలోని ద్వాదశ జ్యోతిర్లింగక్షేత్రం చిన్న అరుణాచలేశ్వర ఆలయంలో మహాశివరాత్రి వేడుకల అనంతరం మంగళవారం హుండి లెక్కింపు చేపట్టగా రూ.1లక్షా 35వేల 500 వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపకుడు శివనాగస్వామి తెలిపారు. ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించిన వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారని తెలిపారు. అన్ని రకాల పూజల ద్వారా ఆలయానికి ఈ ఆదాయం సమకూరిందని తెలిపారు.

ఆర్థిక చేయూత

బూర్గంపాడు: మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన చేతుల అలివేలు గత కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతోంది. వైద్యఖర్చులకు ఆమె కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. విషయం తెలిసిన అదే గ్రామానికి చెందిన చేయూత ట్రస్ట్ ఆర్థికసాయమందించింది. మంగళవారం బాధితురాలికి చేయూత ట్రస్ట్ ప్రతినిధులు రూ.5వేల ఆర్థికసాయమందించి అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు కైపు లక్ష్మీ నారాయణరెడ్డి, మేడం లక్ష్మీరెడ్డి, జక్కిరెడ్డి మల్లారెడ్డి, పుట్టి రాజేష్, కామిరెడ్డి వెంకటరెడ్డి, కైపు నాగిరెడ్డి, కైపు రామచంద్రారెడ్డి, వేముల సురేష్,గంటా మస్తాన్‌బాబు,సెనగ మల్లేశ్వరరావు, హనీఫ్, బొబ్బల వెంకటరామిరెడ్డి,కావిఎరెడ్డి నర్సింహారెడ్డి, కాంసాని వెంకటేశ్వర్లు, కాంసాని సాయి, కర్నాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించాలి

మణుగూరురూరల్: ఓసీ ప్రాజెక్ట్ ప్రభావిత ప్రాంతాల నిరుద్యోగ యువతకు స్థానిక ఓబీ కంపెనీల్లో ఉపాధి కల్పించాలని పగిడేరు ఎంపీటీసీ కుంజా కృష్ణకుమారి, ఉపసర్పంచ్ దామళ్ల దయాకర్‌లు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఈ మేరకు దుర్గా కంపెనీ యాజమాన్యానికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓసీ నిర్వాసిత గ్రామం శ్రీరంగాపురం, ప్రభావిత గ్రామాలైన శాంతినగర్, పగిడేరు, గొల్లకొత్తూరు నిరుద్యోగ యువత ఉపాధి లేక ఇబ్బందులు పడుతోందన్నారు. వారికి సింగరేణి యాజమాన్యం, ఓబీ కంపెనీలు ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన దుర్గా కంపెనీ యాజమాన్యం యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

జెడ్పీటీసీ పరామర్శ

మణుగూరురూరల్: మండల పరిధిలోని ముత్యాలమ్మనగర్ గ్రామపంచాయతీ సంతోష్‌నగర్‌కి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ గ్రామశాఖ కార్యకర్త చెలిగాని రాజు ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు మంగళవారం వారి గృహానికి వెళ్లి రాజును పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ కొమరం జంపేశ్వరి, మండల కోఆప్షన్ సభ్యుడు జావిద్ పాషా, నాయకులు వీరన్న, వార్డ్ మెంబర్ బోడ శ్రీను, బత్తుల నాగేశ్వరరావు, కొమరం రాజు, అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

మార్పు వచ్చేది ఎన్నడు?!

- సుజ్ఞానపురంలో విచ్చలవిడిగా నాటుసారా తయారీ
- ఎక్సైజ్‌శాఖ దాడులు చేసినా మారని తీరు
- సారాకు బానిసలవుతున్న కూలీలు



సుజ్ఞానపురం గ్రామంపై ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులు.. (ఫైల్)

దుమ్ముగూడెం: మండలంలోని సుజ్ఞానపురం నాటుసారా తయారీకి అడ్డాగా మారింది. ఎక్సైజ్ అధికారులు, ఎస్ఈబీ అధికారులు గ్రామంపై దాడులు చేసినప్పటికీ నాటుసారా తయారి మాత్రం ఆగడం లేదు. గ్రామంలోని కొంతమంది వ్యక్తులు నాటుసారా తయారీనే కుటీర పరిశ్రమగా చేసుకుని తయారు చేస్తున్నారు. దీనిని మండలంలోని పలు గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. రాష్ట్ర ఉన్నతాధికారుల మదిలో సైతం ఈ గ్రామం పేరుంది. తెలంగాణ ప్రభుత్వం నాటుసారా తయారీదారులకు జీవనభృతి కల్పించేలా చర్యలు తీసుకుంది. వారికి కిరాణా దుకాణం, ఆటోలు, గొర్రెలను అందజేసింది. అయినప్పటికీ సారా తయారీ, విక్రయాలు మండలంలో అదుపులోకి రాలేదు.

కూలి డబ్బులు సారాకే..

సుజ్ఞానపురం గ్రామంలో తయారు చేసిన నాటుసారాను బండిరేవు, గడ్డొరగట్ట, అచ్చితాపురం, రేగుబల్లి, ములకపాడు, దుమ్ముగూడెం, తూరుబాక, కాటాయిగూడెం, పర్ణశాల, మాంగ్వాయిబాడ్వ, రామచంద్రాపురం, బైరాగులపాడు గ్రామాల్లో విక్రయిస్తున్నారు. రోజువారి కూలీలు పనికి వెళ్తే వచ్చే డబ్బులతో విచ్చలవిడిగా దొరుకుతున్న నాటుసారాను తాగుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ప్రాణపాయం ఉందని తెలిసినా అది ఇచ్చే మత్తుకు బానిసలవుతున్నారు. నాటు సారా తయారీలో పంచదార, అమ్మోనియం, గేదెలు తినే తవ్వుడు లాంటి పదార్థాలను కలిపి తయారు చేస్తుండగా దానిని తీసుకోవడం వల్ల కడుపులోని ప్రేగులు మాడిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. అయినా సారా బానిసలు మాత్రం దానిని వదలడం లేదు. మారుమూల గ్రామాలకే పరిమితమైన విక్రయాలు నేడు మండల ప్రధాన గ్రామాలలో జోరుగా సాగుతున్నాయి.

విచ్చలవిడిగా పంచదార సరఫరా..

సుజ్ఞానపురం గ్రామంలోని సారా తయారీదారులకు కొంతమంది వ్యాపారస్తులు విచ్చలవిడిగా పంచదారను విక్రయిస్తున్నారు. నాటు సారా తయారీదారులకు గతంలో పంచదార విక్రయించే వారిపై కేసులు నమోదు చేసేవారు. ప్రస్తుతం పంచదార విక్రయాలపై అధి కారులు దృష్టి పెట్టకపోవడంతో తయారీదారులకు సులభంగా మారింది. కొంతమంది వ్యాపారస్తులైతే కేవలం నాటు సారా తయారీదారులకు సరఫరా చేయడానికే బస్తాలకు బస్తాలు పంచదార నిల్వలను పెడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. గతంలో లాగా అధికారులు పంచదార విక్రయదారులపై నిఘా ఏర్పాటు చేస్తే ఫలితం సాధించవచ్చని ప్రజల అభిప్రాయం.

దాడులు చేసినా మారని వైనం..

నాటుసారా ప్రధాన తయారీ గ్రామం సుజ్ఞానపురంపై ఎక్సైజ్ శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేస్తున్నప్పటికీ తయారీదారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. అధికారులు దాడులు చేసిన ప్రతిసారి అటవీ ప్రాంతంలో, పొలాల్లో దాచి ఉంచిన పానకం డ్రమ్ములను ధ్వంసం చేస్తున్నారు. అధికారులు గ్రామం నుంచి వెళ్లిన వెంకటనే కొత్తవి కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నారు.అధికారులు ఇన్ని సార్లు దాడులు చేసిన పానకాన్ని ధ్వంసం చేయడమే తప్పా తయారీ దారులు మాత్రం దొరకడం లేదు. దాడులు చేసే సమయంలో గ్రామానికి దగ్గర లోని అటవీప్రాంతంలోకి పారిపాయి దాక్కుంటున్నారు.

మార్పు రావడం లేదు..

సుజ్ఞానపురం గ్రామంపై దాడులు నిర్వహిస్తున్నప్పటికీ వారిలో మార్పు రావడం లేదు. సారా నిల్వలను ఇంటి దగ్గర కాకుండా అటవీప్రాంతంలో, పొలాల్లో నిల్వ చేస్తున్నారు. వాటిని ధ్వంసం చేయడం తప్పా అది ఎవరికి సంబంధించినదో అక్కడ ఎవరూ చెప్పే పరిస్థితి లేకుండా పోయింది. పోలీస్, రెవెన్యూ శాఖల సహకారంతో గ్రామంలో నాటు సారా తయారీ జరగకుండా చర్యలు తీసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నాం. గ్రామస్తులకు అవగాహన కల్పించినా కూడా వారిలో మార్పు రావడం లేదు.

– రహీమున్నీషా, ఎక్సైజ్ సీఐ

మాతృభాషను విస్మరించొద్దు..



అశ్వారావుపేటరూరల్: మాట్లాడుతున్న డాక్టర్ సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు

అశ్వారావుపేటరూరల్: పుట్టుకతో తల్లి నేర్పే మాటలే మాతృభాష అని, అనుబంధాలను పెంచేది అమ్మ భాషను ఎప్పటికీ విస్మరించ వద్దని ప్రముఖ సాహితీవేత్త, సాహితీరత్న డాక్టర్ సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు అన్నారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీలోగల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాతృభాషలో పట్టు సాధిస్తే ఏ భాషనైనా తేలికగా నేర్చుకోవచ్చన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఆంగ్ల మాధ్యమంలో చదువుతున్నప్పటికీ మాతృభాషను మరవకూడదన్నారు. ఎంతో గొప్పతనం ఉన్న మాతృభాషను ప్రతి ఒక్కరూ సంరక్షించుకోవాల్సిన అవసరం ఏంతైనా ఉందని అన్నారు. అనంతరం విద్యార్థులకు భాషాపాటవాలను పోటీలు, వృక్షశతకంలోని పద్యాలను విద్యార్థులు సామూహికంగా ఆలపించారు. కార్యక్రమంలో హెచ్ఎం బేబి పద్మ, ఉపాధ్యాయులు డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మణుగూరు పీహెచ్‌సీలో తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎంసీహెచ్ పీఓ చైతన్య

మణుగూరురూరల్: మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మదర్ అండ్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య మంగళవారం సందర్శించారు. సందర్శనలో భాగంగా ఆయన పీహెచ్‌సీలో గర్భిణులకు అందిస్తున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గర్భిణుల కోసం ఆస్పత్రిలో నిల్వ చేసిన న్యూట్రిషన్ కిట్లను, ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీకి వైద్యపరీక్షల కోసం వచ్చిన పలువురు గర్భిణులను న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. ఆవరణలో వైద్య,ఆరోగ్యసిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బాలాజీ నాయక్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, సీహెచ్ఓ నాగభూషణం, మణుగూరు, పినపాక, కరకగూడెం పిహెచ్‌సీల వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలి

దుమ్ముగూడెం: భగత్‌సింగ్ స్ఫూర్తితో సమస్యలపై నేటి యువత ఉద్యమించాలని జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుమ్ముగూడెం మండల కార్యదర్శి కారం పుల్లయ్య అన్నారు. మంగళవారం ములకపాడు యలమంచి సీతారామయ్య భవనంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీ అధ్యక్షతన జరిగిన రెడ్ బుక్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. దేశంలో మొట్టమొదటి మార్క్సిస్ట్ సిద్ధాంత ఆలోచనపరుల్లో భగత్ సింగ్ ఒకరిని, ఆయన స్ఫూర్తితో దేశాన్ని లూటీ చేస్తున్న బీజేపీని తరిమి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొరసా చిలకమ్మ, మర్మం చంద్రయ్య, నాయకులు మహమ్మద్ బేగ్, పాయం రాంబాబు, వర్ష చిన్నారావు, కాకా కృష్ణ, మహేంద్రనాథ్, గట్టుపల్లి వెంకటేశ్వర్లు, ముర్రం వెంకటేష్, ముద్దరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకారం

అశ్వాపురం: మండల పరిధిలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహకారం అందిస్తున్నారు. ఇటీవల గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమష్టిగా విరాళాలు సేకరించి పాఠశాల గదులకు రంగులు వేసి, మరమ్మతులు చేసి పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దారు. మంగళవారం పాఠశాలను సందర్శించిన ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యేకు విద్యార్థులు పాఠశాలకు 3 తరగతి గదులు కావాలని, ఆట స్థలం, డైనింగ్ హాల్ వంటి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. తరగతి గదుల మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ, సర్పంచ్ కాక అశోక్, ఉపసర్పంచ్ సురేశ్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ సంపత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగు



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

బూర్గంపాడు: క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగుపడతాయని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. ఇరవెండి గ్రామంలో తాళ్లూరి పంచాక్షరయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ నుంచి నిర్వహిస్తున్న తాళ్లూరి భారతీదేవి మెమోరియల్ క్రికెట్ టోర్నీ ముంగిపు సభలో ఆయన పాల్గొన్నారు. మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారులలో ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ఇలాంటి టోర్నీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం బహుమతుల ప్రదానోత్సవంలో భాగంగా.. టోర్నీలో విన్నర్ జట్టుకు రూ.20 వేల నగదు, ట్రోఫీని అందించారు. రన్నర్ జట్టుకు రూ.15 వేల నగదు, ట్రోఫీని అందించారు. కార్యక్రమంలో తాళ్లూరి పంచాక్షరయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, సూదిరెడ్డి సులక్షణ, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, సర్పంచ్ కొర్సా శ్రీలక్ష్మి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, జలగం జగదీష్, వల్లూరిపల్లి వంశీకష్ణ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాల విద్యార్థులకు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. భద్రాచలం కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ అసోసియేషన్ మహిళా సభ్యులు నిర్వహించే కిట్టి పార్టీ ద్వారా సేకరించిన రూ.12 వేలతో 40 దుప్పట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో శిశుమందిర్ నిర్వాహకులు, భద్రాచలం కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ అసోసియేషన్ మహిళా సభ్యులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే నివాళి

భద్రాచలంటౌన్: ప్రజా పోరాటాల ద్వారానే పువ్వాడ ఉదయ్‌కుమార్‌కు ఘన నివాళి అర్పించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ఆకోజు సునీల్ కుమార్ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఖమ్మం మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పువ్వాడ ఉదయ్ కుమార్ 17వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఖమ్మం పట్టణంలో కార్మికుల పక్షాన పోరాడి వందల మందికి ఇళ్ల పట్టాలు ఇప్పించిన వ్యక్తి పువ్వాడ ఉదయ్‌కుమార్ అన్ని కొనియాడారు. కార్యక్రమంలో బల్ల సాయికుమార్, శ్రీనివాస్, డానియల్ ప్రదీప్, శివ, భరణి, హరీష్, రామకృష్ణ, నాయుడు, ప్రదీప్ పాల్గొన్నారు.

భవనం కోసం వినతి

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని ఊట్లపల్లి గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి కొత్త భవనాన్ని మంజూరు చేయాలని సర్పంచ్ సాధు జోత్స్నాబాయి ఆధ్వర్యంలో మంగళవారం వినతి చేశారు. ఈ మేరకు ఐసీడీఎస్ జిల్లా అధికారిణి స్వర్ణలత లెనీనాను కలిసి ఆమె ఈ వినతి పత్రాన్ని అందించారు. ప్రస్తుతం ఉన్న భవనం శిథిలావస్థకు చేరడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో తొలగించామని, దాంతో ఆ నాటి నుంచి కేంద్రాన్ని అద్దె ఇంట్లో నడిపిస్తున్నట్లు వివరించారు.

వేధింపులు ఆపాలి

ములకలపల్లి: రజకులు, నాయిబ్రాహ్మణులకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ ప్రకటించినప్పటికీ.. బిల్లులు చెల్లించాలంటూ విద్యుత్‌శాఖ అధికారులు వేధింపులకు పాల్పడుతున్నట్లు రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముదిగొండ రాంబాబు అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం జరిగిన సంఘ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే బకాయి బిల్లుల నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కందుకూరి రాంబాబు, కుప్పిలి ప్రసాద్, నకిరకంటి ప్రసాద్, నగేశ్. ప్రశాంత్, భుజంగరావు, కందుకూరి సత్యనారాయణ, నాగయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేస్తాం..

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో అగ్ని ప్రమాదంలో పూరిల్లు కాలిపోయిన గుంజాల చిన్న కృష్ణయ్య కుటుంబానికి ప్రభుత్వం ద్వారా తగిన న్యాయం జరిగేలా చూస్తామని ఐటీడీఏ ఏటీడీఓ పూనెం నరసింహారావు అన్నారు. పూరిల్లు దగ్ధం ఘటనకు సంబంధించి జనవరి 2న 'కట్టుబట్టలే మిగిలాయి'అను శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనంతో అధికారులు స్పందించారు. ఈ మేరకు అధికారులు, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ ఆదేశాలు జారీ చేయగా.. గ్రామంలోని కృష్ణ కుటుంబాన్ని మంగళవారం ఏటీడీఓ పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరు, ప్రమాదంలో జరిగిన నష్టం, కుటుంబం వివరాలు సేకరించారు. బాధితుడి వివరాలు డీడీ దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం జరిగేలా చూస్తామని ఏటీడీఓ బాధిత కుటుంబానికి హామీ ఇచ్చారు.

మౌలిక వసతులకు నిధులు



అన్నపురెడ్డిపల్లి: కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

అన్నపురెడ్డిపల్లి: నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక నిధులను మంజూరు చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు తెలిపారు. మండల కేంద్రంలో రూ.45 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజవర్గంలో సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.50 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు చెప్పారు. త్వరలోనే సొంత ఇంటి జాగ ఉన్నవారికి ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.3 లక్షలు అందిస్తుందన్నారు. పోడు భూములకు పట్టాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, సీఎం కేసీఆర్ హామీ మేరకు జర్నలిస్ట్‌లకు మండల కేంద్రాల్లో ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని తెలిపారు. అనంతరం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు భారత లాలమ్మ, ఎంపీపీ సున్నం లలిత, గుంపెన పీఏసీఎస్ చైర్మన్ బోయినపల్లి సుధాకర్, ఎంపీడీఓ రేవతి, తహసీల్దార్ భద్రకాళి, వైస్ ఎంపీపీ మామిళ్లపల్లి రామారావు, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు బుడెన్, సర్పంచ్‌లు బోడా పద్మ, చిరంజీవి, ఉపసర్పంచ్ పర్సావెంకటేశ్వర్లు, నాయకులు భారత రాంబాబు, కొత్తూరి వెంకటేశ్వరరావు, భూపతి నరసింహారావు, జంగాల ఉమ, వేముల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

అశ్వారావుపేటరూరల్: ఏజెన్సీ కేంద్రమైన అశ్వారావుపేటలో మెరుగైన వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నానని, త్వరలోనే స్థానికంగా వంద పడకల ఆస్పత్రిని మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిని ఆయన మంగళవారం డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబుతో కలిసి సందర్శించారు. ముందుగా ఆస్పత్రిలో కొద్ది రోజుల క్రితం శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారిని పరామర్శించి పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. అనంతరం ఆస్పత్రిలో డయాలసిస్ భవన నిర్మాణ పనులు, నూతనంగా ప్రారంభించిన ఆపరేషన్ గది, ఎమ్మెల్యే గ్రాంట్ ద్వారా రూ.35 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన శస్త్ర చికిత్సల పరికరాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్థానికంగానే శస్త్రచికిత్సల సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామని, దీనివల్ల పేదలకు, గిరిజనులకు ఇబ్బందులు తొలగిపోయాయనివివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ పూర్ణచంద్, వైద్యులు తిలక్, అరుణ్ కాంత్, భవ్య సుధ, సిబ్బంది ఉన్నారు.

ప్రారంభమైన జాతర



జాతరను ప్రారంభిస్తున్న దేవరబాల, పూజారి, గ్రామపెద్దలు

దుమ్ముగూడెం: మండల పరిధిలోని నందులచెలక గ్రామంలో సమ్మక్క సారలమ్మ జాతరను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. దేవరబాల వర్షా సుబ్బారావు, ఆలయ పూజారి వర్ష సీతమ్మల పర్యవేక్షణలో జాతరను నిర్వహించడానికి గ్రామస్తులు ముందుకు వచ్చారు. 4 రోజుల పాటు నిర్వహించే ఈ జాతరలో మండలం నుంచి భక్తులు భారీగా హాజరయ్యే అవకాశాలు ఉండటంతో దానికి అనుగుణంగా గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు. నేడు వనదేవతను మేళతాళాలతో, డప్పు వాయిద్యాలతో కోయ వారి డ్యాన్స్‌లతో గద్దెలపైకి తీసుకుని రానున్నారు. జాతర ప్రారంభం కార్యక్రమంలో నడికుడి పంచాయితే సర్పంచ్ తెల్లం, రామకృష్ణ, ఎంపీటీసీ సోడి తిరుపతిరావు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పోడు పట్టాలివ్వాలి

ములకలపల్లి: గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించిన అర్హులైన వారందరి పోడు భూములకు పట్టాలివ్వాలని తెలంగాణా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గౌరి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో మంగళవారం జరిగిన సంఘ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. పాలకపక్షం నామమాత్రపు గ్రామసభలు నిర్వహించి, చేతులు దులుపుకునే కుటిల యత్నాలకు పాల్పడుతోందని ఆరోపించారు. క్షేత్రస్థాయిలో సమగ్రంగా అధ్యయనం నిర్వహించి, గ్రామసభల్లో చర్చించి సాగుదారులకు హక్కుపత్రాలు మంజూరు చేయాలని అన్నారు. అదేవిధంగా ఆగిపోయిన పోడు సర్వేను మరళా చేపట్టాలని అన్నారు. సమావేశంలో సంఘ మండల కమిటీ సభ్యుడు పొడియం వెంకటేశ్వర్లు, కుంజా రామ్మూర్తి, కీసరి వెంకట్రావ్, దుబ్బా వెంకటేశ్వర్లు, కురం ప్రభాకర్, సోయం కృష్ణ పాల్గొన్నారు.

దాడిపై కాంగ్రెస్ ఖండన



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు

మణుగూరురూరల్: హన్మకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకుడు తోట పవన్‌పై అధికార పార్టీ నాయకులు దాడి చేయడాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ కాటిబోయిన నాగేశ్వరరావు ఖండించారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేస్తున్న హాథ్ సే హాథ్ జోడోయాత్రకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే అధికార పార్టీ నాయకులు దాడులకు పాల్పడుతున్నారన్నారు. బీఆర్‌ఎస్ అవలంబిస్తున్న తీరుకు రానున్న రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో నాయకులు పి.నవీన్, బి.సుధాకర్‌రెడ్డి, ఆనంద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'పొదెం' ఎంపికపై హర్షం

దుమ్ముగూడెం: అఖిల భారత కాంగ్రెస్ కమిటీలో ఏఐసీసీ సభ్యుల జాబితాలో భద్రాచలం ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పొదెం వీరయ్యను ఎంపిక చేయడంపై జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా చైర్మన్ కనుబుద్ది దేవా మంగళవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వీరయ్య నాయకత్వంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఐదు స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం అని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాబోతుందని కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రైతు రుణమాఫీ రైతన్నలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని 500 వందలకు గ్యాస్ సిలిండర్ అందిస్తామని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు త్వరలోనే గట్టి గుణపాఠం చెప్తారని రాబోయేది కేంద్రంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు.

నిధులు మంజూరు చేయాలి

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామంలో మసీదు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ముస్లిం మైనార్టీ మండల నాయకులు మంగళవారం అశ్వాపురంలో ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ ముస్లిం మైనార్టీ మండల అధ్యక్షుడు షేక్ నయీం, ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు షేక్ బషీర్, నాయకులు సయ్యద్ యాకూబ్‌ఆలీ, అబ్దుల్ అజీజ్, ఎండీ.జావీద్, సీనియర్ నాయకులు సయ్యద్ జానిషాహిద్, బాజీబాబా తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

భద్రాచలంటౌన్: పేద ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి నిడదవోలు నాగబాబు అన్నారు. భద్రాచలం పట్టణం ఎంపీ కాలనీలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రజా గోస.. బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల అభివృద్ధి బీజేపీతో సాధ్యమని, రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో దేవరపల్లి వెంకటేశ్వర్లు, పార్టీ మండల అధ్యక్షుడు రామ్మోహనరావు, పేరం ఉపేంద్ర, వెంకన్న, వెంకటేశ్వరరావు, కేశవ్, నిఖిల్, హరీష్, మణికంఠ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పీఆర్‌సీ ప్రకటించాలని వినతి



బీటీపీఎస్ సీఈ బిచ్చన్నకు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

మణుగూరుటౌన్: విద్యుత్ సంస్థల ఉద్యోగులకు పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలని కోరుతూ మంగళవారం తెలంగాణ స్టేట్‌పవర్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో బీటీపీఎస్ సీఈ బిచ్చన్నకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా విద్యుత్ ఉద్యోగుల జేఏసీ బీటీపీఎస్ రిజియన్ చైర్మన్ వి.ప్రసాద్, పవర్ ఇంజనీర్ అసోసియేషన్ అధ్యక్షుడు రవిప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవితేజలు మాట్లాడుతూ.. దశల వారి ఆందోళనలో భాగంగా ఈనెల 24 నుంచి 28 వరకు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేయడం జరుగుతుందన్నారు. వచ్చేనెల 1 నుంచి 4వరకు భోజన విరామ సమయంలో కర్మాగారంలో ధర్నాలు నిర్వహించాలన్నారు. వచ్చేనెల 8 నుంచి 23 వరకు రిలే నిరాహార దీక్షలు చేస్తామన్నారు. 24న హైదరాబాద్‌లో మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఉద్యోగులు అందరూ ఈ పోరాటాల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఇంజనీర్స్‌అసోసియేషన్ నాయకులు రాజబాబు, కార్మికసంఘం 1104 అధ్యక్షుడు హెమ్లానాయక్, యూఈఈయూ అధ్యక్షుడు వీరస్వామి, బీసీ సంఘం అధ్యక్షుడు శ్రావన్‌కుమార్, ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు నరేష్, సాయి, కార్మిక సంఘం నాయకులు సత్యనారాయణ, అనిల్, శివ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

22న శ్రీవారి ఆర్జితసేవా టికెట్ల కోటా విడుదల

తిరుమల: మార్చి, ఏప్రిల్, మే నెలకు సంబంధించి శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లను ఈ నెల 22న సాయంత్రం 4 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. వీటిలో కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలున్నాయి. మార్చి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన మిగతా ఆర్జిత సేవా టికెట్లకు ఆన్‌లైన్ లక్కీడిప్ నమోదు ప్రక్రియ 22న ఉదయం 10 గంటల నుంచి 24న ఉదయం 10 గంటల వరకు ఉంటుంది. లక్కీడిప్‌లో టికెట్లు పొందిన వారు సొమ్ము చెల్లించి సేవను ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది.


చెన్నారంలో చెరకు తోటలను పరిశీలిస్తున్న చరణ్‌జిత్‌సింగ్, అధికారులు

మా దేశానికి రండి.. భూమి కౌలుకిస్తాం

చెరకు రైతుల సాగు విధానం భేష్..
ఫిజీ చక్కెర పరిశ్రమల శాఖ మంత్రి చరణ్‌జిత్ సింగ్

నేలకొండపల్లి: 'చెరుకు రైతుల సాగు విధానం బాగుంది.. ఆసక్తి ఉన్న రైతులు మా దేశానికి వస్తే భూమి కౌలుకు ఇప్పిస్తాం.. ఇక్కడితో పోలిస్తే మా దేశంలో ఆదాయం ఎక్కువ వస్తుంది..' అని ఫిజీ చక్కెర పరిశ్రమల శాఖ మంత్రి చరణ్‌జిత్ సింగ్ చెప్పారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురంలోని మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీని చరణ్‌జిత్ సింగ్, ఫిజీ దేశ అధికారులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా చెరుకు సాగు, ధర, క్రషింగ్ వివరాలపై ఫ్యాక్టరీ ఎండీ నామా కృష్ణయ్యతో చర్చించారు. అనంతరం చెన్నారంలో చెరుకు పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. చరణ్‌జిత్ సింగ్ మాట్లాడుతూ చెరుకు సాగు విధానం ఇక్కడ బాగుందని ప్రశంసించారు. రైతులు తమ దేశానికి వస్తే భూములు కౌలుకు ఇప్పిస్తామని ఆహ్వానించారు. అక్కడే ఓ రైతు ఆవులతో దుక్కిపాటు చేస్తుండగా... తమ దేశంలో గోవులను పూజిస్తామని, వ్యవసాయం చేయమని స్పష్టం చేశారు. మంత్రి వెంట ఫిజీ కార్యదర్శి ఈలా, ప్రభుత్వ సీఈవో విమల్‌దత్, మధుకాన్ సీజీఎం కోటయ్య తదితరులున్నారు.

సంక్షేమ సర్కారు ఆదర్శ పాలన

వీడ్కోలులో ఏపీ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ప్రశంసలు


గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ను సత్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: సమాజంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికి ఆదర్శప్రాయమని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దారని అభినందించారు. రాజకీయ నేతల అంతిమ లక్ష్యం ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సమాజ శ్రేయస్సే కావాలని, ముఖ్యమంత్రి జగన్ దీన్ని ఆచరణలో చూపిస్తున్నారని చెప్పారు. ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా బదిలీపై వెళ్తున్న విశ్వభూషణ్ హరిచందన్‌కు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విజయవాడలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ గవర్నర్‌ను ఘనంగా సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. ''రాష్ట్ర ప్రజల కోసం ముఖ్యమంత్రి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుండటం సంతోషదాయకం. సమాజంలో ఏ వర్గాన్ని విస్మరించకుండా సంక్షేమ పథకాలను అందిస్తుండటం నిజంగా అబ్బురం. వీటిపై మేం చాలాసార్లు చర్చించుకున్నాం. ఇన్ని సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేసేందుకు అన్ని నిధులు ఎలా సమకూరుస్తున్నారని ముఖ్యమంత్రి జగన్‌ను అడిగితే అంతా దేవుడి ఆశీర్వాదమని వినమ్రంగా బదులిచ్చారు'' అని గవర్నర్ చెప్పారు. గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ప్రజా ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం అందించి రాజ్యాంగ విలువలకు పెద్దపీట వేశారని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

సీఐపై దాడి కేసులో 11 మంది టీడీపీ నేతల అరెస్ట్

- టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభి ఆస్పత్రికి, 10 మంది జైలుకు..
- టీడీపీ వారిపై మూడు, ఎమ్మెల్యే అనుచరులపై ఒక కేసు నమోదు


దాడిలో గాయపడిన సీఐ కనకారావు

గన్నవరం / నాగాయలంక (అవనిగడ్డ) / కోనేరు సెంటర్: కృష్ణాజిల్లా గన్నవరంలో విధి నిర్వహణలో ఉన్న సీఐ పి.కనకారావును కులం పేరుతో దూషిస్తూ, రాళ్లతో కొట్టి గాయపరిచిన కేసులో టీడీపీ నేతలకు కోర్టు రిమాండ్ విధించింది. వీరిలో టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభిని ప్రభుత్వాస్పత్రికి, పదిమందిని గన్నవరం సబ్‌జైలుకు తరలించారు. గన్నవరంలో సోమవారం టీడీపీ నేతలు సృష్టించిన ఘర్షణకు సంబంధించి పోలీసులు నాలుగు కేసులు నమోదు చేశారు. వీటిలో మూడు టీడీపీ నేతలు, కార్యకర్తలపై.. ఒకటి ఎమ్మెల్యే అనుచరులపై నమోదైంది. పట్టాభి తనను కులం పేరుతో దూషించడమేగాక ఆయనతోపాటు దొంతు చిన్నా, జాస్తి వెంకటేశ్వరరావు మరో ఎనిమిది మంది తనను రాళ్లతో కొట్టి తీవ్రంగా గాయపర్చడంతోపాటు చంపేవిధంగా అనుచరులను ప్రేరేపించారని సీఐ కనకారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభి తదితరులపై అట్రాసిటీ సహా పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యే వంశీమోహన్ అనుచరులు యతేంద్రరామకృష్ణ, మోహన్‌రంగా తదితరులు తమ ఇంటికి వచ్చి బెదిరించినట్లు టీడీపీ నేత దొంతు చిన్నా భార్య రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. టీడీపీ నేతలు పట్టాభి, చిన్నా, వీరంకి గురుమూర్తి, లావు వంశీకృష్ణ, జాస్తి ఆదిశేషు, లావు వంశీకృష్ణ, చల్లగుళ్ల సందీప్, గురివిందగుంట దేవేందర్, ముప్పరాజు కార్తీక్, గుజ్జర్లపూడి బాబూరావు, కంచర్ల సూర్యప్రకాష్‌లను అరెస్ట్‌చేసి మంగళవారం స్థానిక అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. పట్టాభి తనను పోలీసులు కొట్టినట్లు ఆరోపించడంతో ఆయనకు విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యచికిత్స చేసిన తర్వాత రిమాండ్ నిమిత్తం కోర్టు ముందు హాజరుపరచాలని జడ్జి బి.శిరీష పోలీసులను ఆదేశించారు. మిగిలిన పదిమందికి రిమాండ్ విధించారు. దీంతో పోలీసులు పట్టాభిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి, మిగిలినవారిని గన్నవరం సబ్‌జైలుకు తరలించారు.

పోలీసులతో పట్టాభి భార్య వాగ్వాదం

ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని పట్టాభి ఇంటివద్ద మంగళవారం ఆయన భార్య చందన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశం నిర్వహించిన ఆమె నిరపరాధి అయిన తన భర్తను విడుదల చేయకపోతే డీజీపీ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేస్తామని ప్రకటించటంతో పోలీసులు అభ్యంతరం చెప్పారు. దీనిపై ఆమె పోలీసులతో పరుష పదజాలంతో వాగ్వాదానికి దిగారు.

టీడీపీ నేతల దౌర్జన్యం

గన్నవరం ఘటనకు సంబంధించి మచిలీపట్నం, నాగాయలంకలో సోమవారం అర్ధరాత్రి టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆందోళనకు దిగి, పోలీసులతో దురుసుగా ప్రవర్తించారు. గన్నవరం నుంచి తొమ్మిదిమంది టీడీపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు మచిలీపట్నంలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రానికి తరలించారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో గన్నవరం టీడీపీకి చెందిన ఒక న్యాయవాది తొమ్మిదిమంది అనుచరులతో అక్కడికి వెళ్లి భద్రత విధుల్లో ఉన్న సిబ్బందిపై దౌర్జన్యం చేసి పోలీసులు నిర్బంధించిన తొమ్మిదిమంది నాయకులు, కార్యకర్తలను కార్లలో తప్పించారు. ఈ సమాచారం అందుకున్న ఎస్పీ జాషువ వెంటనే అధికారులను అప్రమత్తం చేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది జీపీఎస్ ద్వారా తప్పించుకున్న వారిని వెంబడించి నిమిషాల వ్యవధిలో న్యాయవాదితో సహా అందరినీ పట్టుకుని బందరు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విధుల్లో ఉన్న మహిళా కానిస్టేబుల్ వాణి ఫిర్యాదు మేరకు మొత్తం 19 మందిపై కేసు నమోదు చేశారు. గన్నవరం ఘటనకు సంబంధించి పోలీసులు అదుపులోకి తీసుకున్న మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను సోమవారం అర్ధరాత్రి నాగాయలంక పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీంతో ఆయన అనుచరులు, స్థానిక టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఆందోళన చేశారు. బోడెని చూసేందుకు అనుమతించాలంటూ సీఐ శ్రీనివాస్‌తో వాగ్వాదానికి దిగారు. టీడీపీ మహిళా నేత తలశిల స్వర్ణలత, కొందు తెలుగు తమ్ముళ్లు సచివాలయ మహిళా కానిస్టేబుల్‌తో దురుసుగా మాట్లాడారు. బోడె ప్రసాద్‌ను స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు.

రెచ్చగొట్టి మరీ రచ్చ రచ్చ

గన్నవరం ఘటనలో బరితెగించిన టీడీపీ

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఎన్టీపీసీ విద్యుత్ కేంద్రంలో భారీ లోపం

- 800 మెగావాట్ల తొలి యూనిట్ సిద్ధమైనా ట్రయల్ రన్ వాయిదా
- నాసిరకం రీహీటర్ ట్యూబ్స్ లీకేజీయే కారణం
- 7,500 చోట్ల మరమ్మతులు అవసరం.. వాటి పూర్తికి మరో నెల సమయం
- మార్చి చివరిలో తొలి యూనిట్‌లో ఉత్పత్తికి అవకాశం
- జూలైలో రెండో యూనిట్‌లో ఉత్పత్తికి ప్రణాళికలు



సాక్షి, హైదరాబాద్: నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్టీపీసీ) ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా రామగుండంలో 1600 (2x800) మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టులో భారీ లోపం బయటపడింది. విద్యుత్ కేంద్రంలోని 800 మెగావాట్ల తొలి యూనిట్ నిర్మాణం పూర్తయినా బాయిలర్‌లోని రీహీటర్ ట్యూబ్స్ విఫలం కావడంతో గత డిసెంబర్‌లో జరగాల్సిన ట్రయల్ రన్ వాయిదా పడింది. మరమ్మతుల్లో భాగంగా ఈ గొట్టాలకు లోపాలున్న చోట కట్ చేసి వెల్డింగ్ చేస్తున్నారు. ఏకంగా 7,500 చోట్ల వెల్డింగ్ చేస్తున్నారని, ఇందుకు మరో నెల రోజుల సమయం పట్టనుందని అధికార వర్గాలు తెలిపాయి. ఆలోగా మరమ్మతులు పూర్తయితే మార్చిలో తొలి యూనిట్ ద్వారా ప్రయోగాత్మకంగా విద్యుదుత్పత్తి జరిపి ట్రయల్ రన్ నిర్వహించే అవకాశాలున్నాయి.

రీహీటర్ ట్యూబులే కీలకం

థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో హై ప్రెషర్, ఇంటర్మీడియేటరీ ప్రెషర్, లో ప్రెషర్ టర్బైన్లు ఉంటాయి. బాయిలర్లలో వేడిచేసిన నీళ్లు ఆవిరిగా మారి 600 సెంటిగ్రేడ్‌ల ఉష్ణోగ్రత, భారీ పీడనంతో గొట్టాల ద్వారా 'హైప్రెషర్ టర్బైన్'లోకి ప్రవేశించి దాన్ని తిప్పుతూ మళ్లీ వెనక్కి మళ్లుతుంది. బాయిలర్‌లోకి తిరిగి చేరే సమయానికి ఆవిరి ఉష్ణోగ్రత 300 సెంటిగ్రేడ్‌లకు పడిపోతుంది. రీహీటర్ ట్యూబ్స్‌లో మళ్లీ 600 సెంటిగ్రేడ్‌లకు వేడెక్కిన తర్వాత 'ఇంటర్మీడియేటరీ ప్రెషర్ టర్బైన్'లోకి గొట్టాల ద్వారా ఆవిరి ప్రవేశించి దాన్నీ తిప్పుతూ చివరకు 'లో ప్రెషర్ టర్బైన్ 'లోకి చేరుతుంది. అక్కడ చల్లబడిన ఆవిరి మళ్లీ బాయిలర్‌లోకి నీళ్ల రూపంలో ప్రవేశిస్తుంది. మళ్లీ ఆవిరిగా మారి 'హై ప్రెషర్ టర్బైన్'లోకి ప్రవేశిస్తుంది. ఈ ప్రక్రియ అంతా ఒక లూప్‌గా జరుగుతుంది. నీళ్లు రీసైకిల్ అవుతూ ఉంటాయి.

నాసిరకం గొట్టాలతో సమస్యే

ఆవిరి టర్బైన్లను తిప్పడం ద్వారా వెలువడే యాంత్రికశక్తిని ఎలక్ట్రిక్ జనరేటర్ విద్యుచ్ఛక్తిగా మార్చుతుంది. ఈ ప్రక్రియలో కీలకమైన 'రీహీటర్ ట్యూబ్స్'లో నాణ్యత లేకుంటే అవి 600 సెంటిగ్రేడ్‌ల ఉష్ణోగ్రతలతోపాటు తీవ్ర పీడనాన్ని తట్టుకోవడం సాధ్యం కాదు. నాసిరకం ముడిసరుకుతో తయారైన గొట్టాలు తరచూ కోతకు గురికావడం, తుప్పుపట్టడం జరుగుతుందని నిపుణులు అంటున్నారు. దీంతో ఆవిరి ఉష్ణోగ్రతలు పడిపోయి విద్యుదుత్పత్తి నిలిచిపోతుందని చెబుతున్నారు. రీహీటర్ ట్యూబ్స్‌లో వచ్చే సమస్యలతోనే థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తికి అధిక శాతం అంతరాయాలు కలుగుతాయి. దక్షిణ కొరియా నుంచి దిగుమతి చేసుకున్న గొట్టాలను ఎన్టీపీసీ వినియోగించినా విఫలం కావడంపట్ల నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి వెల్డింగ్ చేసి మరమ్మతులు చేసినా భవిష్యత్తులో అవి మళ్లీ విఫలమయ్యే అవకాశముందని పేర్కొంటున్నారు. రీహీటర్ గొట్టాలకు లీకేజీలతో గత డిసెంబర్‌లో నిర్వహించాల్సిన తొలి యూనిట్ సింక్రనైజేషన్ ప్రక్రియ వాయిదా పడింది.

నిర్మాణ జాప్యంతో రాష్ట్రంపై భారం

తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టులోని తొలి యూనిట్ నుంచి 2020 జూన్‌లో, రెండో యూనిట్ నుంచి 2020 నవంబర్ నాటికి వాణిజ్యపరంగా విద్యుదుత్పత్తి (సీఓడీ) ప్రారంభం కావాల్సి ఉంది. కానీ నిర్మాణంలో జాప్యంతో తొలి యూనిట్ గడువును 2023 మార్చి, రెండో యూనిట్ గడువును 2023 జూలైకు ఎన్టీపీసీ పొడిగించింది. రీహీటర్ ట్యూబ్స్ విఫలం కాకుంటే గత జనవరి నాటికి తొలి యూనిట్, మార్చి నాటికి రెండో యూనిట్ అందుబాటులోకి వచ్చేదని అధికార వర్గాలు తెలిపాయి. వేసవి విద్యుత్ అవసరాల కోసం ప్రస్తుతం రాష్ట్రం ఒక్కో యూనిట్‌ను సగటున రూ.7.20 ధరకు నిత్యం రూ.60 కోట్ల విలువైన విద్యుత్‌ను ఎక్ఛేంజీల నుంచి కొంటోంది. ఎన్టీపీసీ విద్యుత్ కేంద్రం సకాలంలో పూర్తై ఉంటే యూనిట్‌కు రూ. 5 ధరతో విద్యుత్ లభించేది. దీంతో అధిక ధర విద్యుత్ కొనుగోళ్ల భారం తప్పేదని, ప్రస్తుత ఫిబ్రవరిలోనే రూ.50 కోట్ల మేర ఆదా అయ్యేవని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

సమష్టి కృషితోనే వార్షిక లక్ష్యసాధన

సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) శ్రీనివాస్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించుకున్న 70 మిలియన్ టన్నుల లక్ష్యసాధనకు అందరూ కలిసి కృషి చేయాలని డైరెక్టర్(ఆపరేషన్స్) ఎన్వీకే.శ్రీనివాస్ కోరారు. కొత్తగూడెంలోని కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. నిర్దేశించిన లక్ష్యాలు సాధిస్తేనే సంస్థకు లాభాలు రావడంతోపాటు ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం, సౌకర్యాల కల్పనకు యజమాన్యం కృషి చేస్తుందని తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగింపునకు నలభై రోజుల సమయమే ఉన్నందున సంస్థ వ్యాప్తంగా రోజు, నెలవారీ బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. కాగా, వీకే-7, జేకే ఓసీలకు త్వరలోనే అన్ని అనుమతులు వచ్చేలా యాజమాన్యం చర్యలు చేపట్టారని తెలిపారు. కాగా, భోపాల్‌లో కేంద్ర గనుల అనుమతుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సింగరేణి అధికారులు పాల్గొనగా, త్వరలో కొత్త గనులు వచ్చే అవకాశం ఉందని డైరెక్టర్ శ్రీనివాస్‌ఈ సందర్భంగా వెల్లడించారు.

రేపు ఉమ్మడి జిల్లా ఆర్చరీ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్థాయి సీనియర్స్ ఆర్చరీ ఎంపిక పోటీలను గురువారం(23వ తేదీ) నిర్వహించనున్నారు. కొణిజర్ల మండలం తనికెళ్లలోని గ్రేస్ చిల్డ్రన్ స్కూల్‌లో సీనియర్ పురుషుల, మహిళల ఆర్చరీ ఎంపికలు జరుగుతాయని ఆర్చరీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కార్యదర్శి పుట్టా శంకరయ్య తెలిపారు. వివిధ విభాగాల్లో పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు జరగనుండగా, ఇక్కడ ప్రతిభ చాటే క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వయసు ధృవీకరణ పత్రాలతో ఉదయం 10 గంటలకు రిపోర్టు చేయాలని సూచించారు.

జిల్లా వార్తలు

ఈ 40 రోజులూ ధ్యానమే..

- నేటి నుంచి క్రైస్తవుల ఉపవాస దీక్షలు
- ఏప్రిల్ 10 ఈస్టర్ వరకు కొనసాగింపు
- ప్రార్థనలకు సిద్ధమవుతున్న మందిరాలు


దీక్షలకు ముస్తాబైన ఇల్లెందు మండలంలోని సుంకరగూడెం చర్చి

ఇల్లెందురూరల్: ప్రార్థన, ప్రాయశ్చిత్తం, ఉపవాస దీక్షలు.. ఇదీ క్రైస్తవుల 40 రోజుల దీక్షల సారాంశం. బుధవారం నుంచి మొదలయ్యే ఈ దీక్షలకు జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు సమాయత్తమవుతున్నారు. ఏటా ఆచరించే ఉపవాస దీక్షలను బసవ బుధవారంతో ఆరంభించి ఈస్టర్ పండుగతో ముగిస్తారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని చర్చిల్లో నేడు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు.

ఇదీ నేపథ్యం..

సమస్త మానవాళి రక్షణ కోసం ఏసుక్రీస్తు లోకానికి వచ్చి 40 రోజులు శ్రమించి కల్వరి గిరిలో శిలువపై బలయ్యాడని బైబిల్ చెబుతోంది. మానవులు చేసిన పాపాల నుంచి ప్రాయశ్చిత్తం పొందాలంటే రక్తం చిందించాలని, అయితే భక్తుల కోసం ఏసు ప్రభువే శిలువపై మరణం పొందాడని పలువురి విశ్వాసం. శిలువ వేయక ముందు ఏసు అనుభవించిన శ్రమను ఈ ఉపవాస దీక్షల్లో ధ్యానిస్తారు. యూదుల సంప్రదాయంలో 40తో ముడిపడి ఉన్న సంఘటనల నేపథ్యంలో ఈ 40 రోజుల దీక్షను ఆచరించినట్లు చెబుతారు. దైవకుమారిడిగా శ్రమను జయించే శక్తి ఉన్నా.. మానవుడి మాదిరిగా జీవితాన్ని చూపడానికి ఏసుక్రీస్తు శ్రమను అనుభవించాడని క్రైస్తవులు స్మరించుకుంటారు. ఈ 40 రోజుల ప్రార్థనలు ఉపవాసం, ప్రాయశ్చిత్తం అనే అంశాలపైనే సాగుతుంది. ఈ దీక్షా కాలంలో క్రైస్తవులు తాము చేసిన పొదుపును సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించడం ద్వారా ఏసుక్రీస్తు చూపిన సేవా మార్గంలో నడుచుకుంటారు. ఇలా 40 రోజుల పాటు ప్రతి బుధ, శుక్రవారాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.

ఏసు త్యాగాన్ని స్మరించుకుంటూ..

2వేల సంవత్సరాల క్రితం ఏసు శిలువ వేసుకుని మరణం పొందారని గుర్తు చేసుకుంటూ క్రైస్తవులు బసవ బుధవారం నుంచి ఈస్టర్ పండుగ వరకు 40 రోజులు ఉపవాస దీక్ష ఆచరిస్తారు. వీటినే 'లెన్ట్ డేస్' అంటారు. ఏటా క్రైస్తవుల క్యాలెండర్‌ను అనుసరించి ఈ లెన్ట్ డేస్‌ను నిర్ణయిస్తారు. ఈ సమయంలో భక్తిశ్రద్ధలతో ఏసును స్మరించుకుంటూ దీక్షను ఆచరిస్తారు. ఈ ఉపవాస దినాలు ఈనెల 22 నుంచి ఏప్రిల్ 10వ తేదీ ఈస్టర్ పండుగ వరకు కొనసాగుతాయి. ఏసుక్రీస్తు శిలువపై మరణించి సమాధి చేయబడిన మూడో రోజున తిరిగి లేచే సందర్భంగా ఈస్టర్ పర్వదినాన్ని జరుపుకుని లెన్ట్ డేస్‌ను ముగిస్తారు.

భక్తిశ్రద్ధలతో ఆచరిస్తాం



ఏసు త్యాగాన్ని స్మరించుకుంటూ 40 రోజుల పాటు ఉపవాస దీక్షను భక్తిశ్రద్ధలతో ఆచరిస్తాం. అనునిత్యం ఆయన స్మరణలోనే ఉంటూ ప్రార్థన చేస్తుంటాం. ఏసు చూపిన శాంతిమార్గంలో పయనిస్తాం. ఈ మాసంలో చేసిన పొదుపును సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగిస్తాం.

– చీమ లక్ష్మయ్య, బాలాజీనగర్, ఇల్లెందు మండలం

ఈస్టర్ వరకు దీక్షలు చేస్తాం



బసవ బుధవారం నుంచి ఈస్టర్ పండుగ వరకు 40 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు ఆచరిస్తాం. ఈ 40 రోజులు ఏసు జనన, మరణ నేపథ్యాలను స్మరించుకుంటూ ధ్యానం చేస్తాం. ఆయన సందేశాన్ని సర్వమానవాళికి వివరించి ప్రపంచ శాంతికి పాటుపడుతాం.

– కరకపల్లి సరోజనమ్మ, కొమరారం

ఆధ్యాత్మికంగా నిలబడటానికే..



బసవ బుధవారం నుంచి శ్రమల రోజులు ప్రారంభమవుతాయి. ఈ 40 రోజులు ఉపవాస దీక్షలు ఆచరించడంతోపాటు చేసిన పొదుపును సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగిస్తాం. మనిషి భౌతికంగా ఉన్న కోరికలను అణచుకొని ప్రభువు చూపిన మార్గంలో నడవడానికి ఈ ఉపవాస దీక్షలు దోహదం చేస్తాయి.

– జకరయ్య, ప్రొస్బైట్ ఇన్‌చార్జ్, కొమరారం

'కట్టెకోల'కు సేవా శిరోమణి అవార్డు


చిననర్సయ్యను సన్మానిస్తున్న ఏపీ మంత్రి సత్యనారాయణ తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఖమ్మంకు చెందిన కవి, రచయిత కట్టెకోల చిన నర్సయ్యను ఆంధ్రప్రదేశ్ అధికార బాషా సంఘం, ఎడిటర్స్ అసోసియేషన్ బాధ్యులు సత్కరించారు. విజయవాడలో మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సమావేశంలో చిన నర్సయ్యను సన్మానించి మాతృభాష సేవా శిరోమణి అవార్డు అందజేశారు. ఏపీ మంత్రి బొత్స సత్యనారాయణ, ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు, ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీ.వీ.కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఏఓ ఛత్రునాయక్

మహబూబాబాద్ రూరల్: రైతులకు వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి ఛత్రునాయక్ సూచించారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఏఓలు, ఏడీఏలతో మంగళవారం ఏర్పాటుచేసిన సమీక్షలో ఆయన మాట్లాడారు. రైతుబీమా, పంటల నమోదు, ఎరువుల సరఫరా తదితర అంశాలను రైతులందరికీ వివరించాలన్నారు. యాసంగిలో సాగవుతున్న పంటల్లో సమగ్ర సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈసమావేశంలో ఏడీఏలు లక్ష్మీనారాయణ, శోభన్‌బాబు, టెక్నికల్ ఏడీఏ రాజనరేందర్, టెక్నికల్ ఏఓలు సారయ్య, స్వామి పాల్గొన్నారు.

సాగర్ నీటి కోసం రోడ్డెక్కిన అన్నదాతలు

ఎండిన మొక్కలు, పురుగు మందు డబ్బాలతో నిరసన


బోనకల్ కాల్వ బ్రిడ్జిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

బోనకల్: ఖమ్మం జిల్లా బోనకల్ బ్రాంచ్ కెనాల్ పరిధిలోని చివరి భూములకు నీరందక పంటలు ఎండిపోతున్నాయని ఆరోపిస్తూ అన్నదాతలు రోడ్డెక్కారు. వైరా-జగ్గయ్యపేట ప్రధాన రహదారిలోని బోనకల్ బ్రిడ్జిపై మంగళవారం మూడు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. బీబీసీ పరిధిలోని దాములూరి మేజర్ కింద బోనకల్ మండలంలోని మోటమర్రి, ఆళ్లపాడు, గోవిందాపురం (ఏ), మధిర మండలంలోని బయ్యారం, అల్లీనగరం, మడుపల్లి, ఇల్లూరు, రాయపట్నం రెవెన్యూ పరిధిలోని ఏడు వేల ఎకరాల్లో మిర్చి, మొక్కజొన్న, వరి, వేరుశెనగ పంటలను సాగుచేశారు. అయితే, సాగర్ జలాలను వారబందీ విధానంలో విడుదల చేస్తుండడంతో తమ పొలాలకు నీరందక ఎండిపోతున్నాయని మధిర, బోనకల్ మండలాలకు చెందిన రైతులు రాస్తారోకోకు దిగారు. పంట చేతికందే సమయాన తమ పొలాల వద్దకు సాగర్ జలాలు రాకముందే ఆపేస్తుండడంతో నష్టపోయే అవకాశముందని తెలిపారు. బోనకల్ ఇరిగేషన్ కార్యాలయం ఎదుట గత నెలలో ఆందోళన నిర్వహిస్తే పర్యవేక్షిస్తామని చెప్పిన అధికారులు ఆ తర్వాత పట్టించుకోలేదని ఆరోపించారు. ఈమేరకు ఎండిపోయిన మిర్చి మొక్కలు, పురుగుల మందు డబ్బాలతో రాస్తారోకో చేపట్టగా, పోలీసులు, ఇరిగేషన్ అధికారులు నచ్చచెప్పి ఆందోళన విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో ఆళ్లపాడు సర్పంచ్ మర్రి తిరుపతిరావుతో పాటు శాఖమూరి కోటేశ్వరావు, సూర్యదేవర సాంబశివరావు, పల్లిపాటి తిరపతిరావు, రైతులు పాల్గొన్నారు.

జన్మభూమికి సేవ చేయడం అదృష్టం

'నోష్' ల్యాబ్ ఎండీ భీమిరెడ్డి సత్యనారాయణరెడ్డి


సత్యనారాయణరెడ్డి దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

వేంసూరు: పుట్టిన ఊరు, చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కృషి చేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నానని హైదరాబాద్‌లోని నోష్ ల్యాబ్ ఎండీ భీమిరెడ్డి సత్యనారాయణరెడ్డి తెలిపారు. వేంసూరు మండలం యర్రగుంటపాటుకు చెందిన ఆయన గ్రామంలోని రామాలయంలో ప్రతిష్ఠాపన పూజలు చేపట్టిన 16 రోజులు పూర్తయిన సందర్భంగా మంగళవారం నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు సుమారు రూ.50 లక్షల విలువైన ఫర్నీచర్ సమకూర్చడమే కాక, ఇతర వసతులు కల్పించినట్లు తెలిపారు. అనంతరం గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న సత్యనారాయణరెడ్డి గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ మారోజు సుమలత, ఎంఈఓ సీహెచ్.వెంకటేశ్వరరావు, సర్పంచ్ గడ్డం కృష్ణకుమారి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు


మాట్లాడుతున్న డీఈఓ రామారావు

నర్సింహులపేట: పదో తరగతి విద్యార్థులు ఇష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి రామారావు తెలిపారు. నర్సింహులపేటలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలపై అవగాహన సదస్సు ఏర్పాటుచేయగా, డీఈఓ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యంతో చదివితేనే ఫలితాలు వస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా ఎక్కువ మార్కులు సాధించేందుకు పాటించాల్సిన మెళకువలను వివరించారు. ఈకార్యక్రమంలో ఆర్డీఓ రమేష్, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ మహంకాలి బుచ్చయ్య, పరీక్షల విభాగం అధికారి విజయసుశీల, మండల ప్రత్యేకాధికారి నర్సింహరావు, ఎంపీడీఓ సత్యనాయణరెడ్డి, హెచ్‌ఎంలు శ్రీలత, అనందబాబు, సీఆర్‌పీలు శేషు, వీరన్న, రవి, నాగేష్, నరహరి పాల్గొన్నారు.